## క్లుప్తంగా

### సమతుల ఆహారంతోనే ఆరోగ్యం



పౌష్టికాహార ప్రాధాన్యతపై ప్రదర్శన ఇస్తున్న ఆరోగ్య సిబ్బంది

**గణపవరం:** సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాగించొచ్చని, ప్రతీ ఒక్కరూ ఆహార నియమాలు పాటించాలని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. మంగళవారం పిప్పర పీహెచ్‌సీలో పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారలోపం వలన వచ్చే వ్యాధులను గురించి ప్రతీ ఒక్కరూ తమ రోజువారీ ఆహారంలో ఆకు కూరలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, పిప్పర ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గా భవాని, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### మట్టి విగ్రహాలపై కళాజాత



దెందులూరులో మట్టి విగ్రహాల వాడకంపై కళాజాత బృందం ప్రదర్శన దృశ్యం

**దెందులూరు:** మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలను వాడాలని, ప్యారిస్ ఆఫ్ ప్లాస్టిక్‌తో తయారు చేసిన విగ్రహాలను వాడకూడదని యడవల్లి కళాజాత బృందం (తాడేపల్లిగూడెం) మంగళవారం దెందులూరులో ప్రదర్శన నిర్వహించారు. బస్టాండ్ సెంటర్, ఎన్టీఆర్ బొమ్మ సెంటర్‌లో బృందం సభ్యులు నాటికల ద్వారా ప్రజలకు మట్టి విగ్రహాలను మాత్రమే వాడాలని అవగాహన కల్పించారు.

**చవితికి ముమ్మర ఏర్పాట్లు**

మండలంలోని గ్రామగ్రామాన వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. వినాయకుడి ఆలయాల్లో నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా వీధుల్లో యువత పందిళ్లు వేసి, పనులు చేస్తున్నారు.

### రైలు ప్రమాదంలో వృద్ధుడి మృతి

**భీమడోలు:** భీమడోలు రైల్వే స్టేషన్ పరిధిలోని పాతూరు రైల్వే గేటు సమీపాన మంగళవారం రైలు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ద్వారకా తిరుమల మండలం ఎం.నాగులపల్లికి చెందిన కామిరెడ్డి బుచ్చిరాజు (72) రైలు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని గుర్తించి, పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజనా సుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బస్ పాస్‌ల పంపిణీ

**ఉంగుటూరు:** రాచూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం బస్సు పాస్‌లు పంపిణీ చేశారు. మంగళవారం హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వందమందికి ఐడి కార్డులు, ఉచిత బస్సు పాస్‌లు అందజేశారు. దాత మంద శ్రీనివాసరెడ్డి సహాయంతో పాసులు అందజేశారు. ఆయనను ఆర్టీసీ సత్కరించింది. కార్యక్రమంలో హెచ్ఎం విజయకుమార్, దాత మంద శ్రీనివాసరెడ్డి, ఆర్టీసీ డిపో పీఆర్వో దొంతల విజయకుమార్, ఉపాధ్యాయులు వెలిచర్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### సహాయక చర్యల్లో ప్రజల భాగస్వామ్యం భేష్



బాధితులకు ఆహారం సిద్ధం చేసి, పంపిస్తున్న దృశ్యం

**పెదవేగి :** వరద సహాయక చర్యల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యం అవుతున్నారని, వారిని బాధితులుగా కాకుండా ఆత్మ బంధువులుగా భావించి వారికి ఆహార పొట్లాలు అందజేస్తున్నారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. విజయవాడను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరద వలన ముంపునకు గురైన లక్షలాది మంది వరద బాధితులను ఆదుకోవటానికి ప్రజలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సహాయక చర్యల్లో నాయకులు, కార్యకర్తలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

### దెందులూరు నుంచి 60 వేల ప్యాకెట్ల సరఫరా

**దెందులూరు:** విజయవాడ వరద బాధితులకు దెందులూరు నియోజకవర్గం నుంచి 60 వేల ఆహార పొట్లాలను ఎమ్మెల్యే చింతమనేని తయారు చేయించి పంపించారని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. ఉద్యోగులు, నాయకులు ఆహార పొట్లాల తయారీలో సహాయ సహకారాలు అందించారు. ప్యాకెట్లను లారీలో ఎక్కించి విజయవాడ పంపించామన్నారు.

# మల్బరీ సాగు.. లాభాలు బాగు



మేధినరావుపాలెంలోని మల్బరీ తోట



తయారీకి సిద్ధంగా ఉన్న గుడ్డు



నిర్మాణం పూర్తి కావచ్చిన షెడ్డు

**సెరీకల్చర్ వైపు దృష్టి సారిస్తున్న మెట్ట రైతులు**

**దెందులూరు:** అతి తక్కువ ఖర్చుతో మల్బరీ సాగు మెట్ట ప్రాంత రైతుల పాలిట సిరులు పండిస్తోంది. దీంతో గత 4, 5 సంవత్సరాలుగా మెట్ట రైతాంగం మల్బరీ సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వం మల్బరీ సాగుకు అతి ప్రాధాన్యత ఇవ్వడం, నిధులు కేటాయించడం, సాగును ప్రోత్సహించేందుకు ఎస్సీ, బీసీ రైతులకు నూరు శాతం రాయితీలు ప్రకటించడం దీనికి తగ్గట్టు ఖర్చుకు మూడు రెట్లు అధికంగా లాభాలు రావడంతో ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా మల్బరీ సాగు వైపు మెట్ట ప్రాంత రైతాంగం ప్రాధాన్యతనిస్తున్నారు. పెదవేగి, దెందులూరు, భీమడోలు, కామవరపుకోట, ద్వారకా తిరుమల ప్రాంతాల్లో 600 ఎకరాల మల్బరీ సాగు చేస్తున్నారు.

**ప్రభుత్వ రాయితీ**

- ఎస్సీ, బీసీ రైతులకు ఎకరాకు రూ.3 లక్షల 60 వేలు మంజూరు చేస్తున్నారు. ఓసీ రైతులకు రూ.3 లక్షలు, వడ్డీలు, ఎస్సీ, బీసీలకు రూ.41 వేలు, ఓసీ రైతులకు రూ.36 వేలు మంజూరు చేస్తున్నారు.
- వరండాకు రూ.30 వేలు, ప్లాంటేషన్ నిమిత్తం ఎకరాకు ఎస్సీ, బీసీ రైతులకు రూ.27 వేలు, ఓసీ రైతులకు రూ.22,500 మంజూరు చేస్తున్నారు. ఎకరాకు సంవత్సరంలో 10 క్రాప్‌లు తీస్తారు.
- రైతుకు ఎకరాకు రూ.30 వేలు ఖర్చయితే రూ.1 లక్ష దిగుబడి లభిస్తుంది. ఎకరాకు 70 వేలు రైతుకు లాభం కలుగుతుంది.

#### రాయితీలు వినియోగించుకోవాలి



సన్న, చిన్నకారు రైతులు మెట్ట ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం మల్బరీ సాగుకు ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి. అధిక దిగుబడులు, లాభాలను గమనించి మల్బరీ సాగు మరింత పెంచేందుకు మెట్ట ప్రాంత రైతాంగం ముందుకు రావాలి.

– రత్తయ్య, టెక్నికల్ అసిస్టెంట్, సెరీకల్చర్

#### మల్బరీ సాగుతో అధిక లాభాలు



మెట్ట ప్రాంత రైతులకు మల్బరీ సాగు వరంగా మారింది. సన్న, చిన్న కారు రైతులకు అద్భుతమైన పథకం. తక్కువ ఖర్చు, అధిక దిగుబడి, లాభాలతో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధి, భద్రత లభిస్తుంది.

– కాలి సుధ, రైతు

#### రైతాంగ అభివృద్ధికి ప్రాధాన్యం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ తండ్రి అడుగు జాడల్లో నడిచి, రైతాంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. ఇతర పంటలను ప్రోత్సహించినట్లుగానే మల్బరీ సాగుకు ఎస్సీ, బీసీ రైతులకు నూరు శాతం సబ్సిడీ అందించారు. అప్పటి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, రైతులను ప్రోత్సహించేందుకు ఇతర పంటలతో పాటు మల్బరీ సాగు చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించారు.

– కె.కొండయ్య, రైతు

### ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

**భీమడోలు:** గురుపూజోత్సవం పురస్కరించుకుని మండల పరిధిలోని 10 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు భీమడోలు ఎంఈవో-1 ఈదుపల్లి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 5న టీచర్స్ డే సందర్భంగా ఎంపిక కాబడిన 10 మందిని భీమడోలు ఎంఆర్సీలో సత్కరిస్తామన్నారు. బి.ఝాన్సీరాణి, జి.రెడ్డియ్య, ఎన్.నిర్మల కుమారి, డీవైకేవీఎస్ ఆనంద్‌బాబు, ఏ.రాంబాబు, బీఎంఎం రాజ్యం, బీవీ కృష్ణారావు, ఎన్.జయశ్రీ, సీహెచ్ఆర్ జ్యోతిబసు, ఎం.వందనలను ఎంపిక చేసామన్నారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

### నీట మునిగిన కళాశాల గ్రౌండ్



నారాయణపురం కళాశాల గ్రౌండ్‌లో నిలిచిన నీరు

**ఉంగుటూరు:** నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఉన్న ఏకైక గ్రౌండు వర్షం నీటితో నిండింది. సుమారు నెల రోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. జూలైలో కురిసిన వర్షం మొదలుకొని ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. ఈ కళాశాల మెరక పనులు చాలాసార్లు చేసినా ఈ గ్రౌండు పరిస్థితి ఇలానే ఉంది.

## నేత్రదానం అంధుల జీవితాలకు వెలుగు



గణపవరం పీహెచ్‌సీలో నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

**గణపవరం:** నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగు నింపే అవకాశం కలుగుతుందని, ప్రతీ ఒక్కరూ నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ నేత్రదానం ఏ వయస్సు వారైనా చేయవచ్చునని, మరణించిన తర్వాత మాత్రమే నేత్రదానం ఇవ్వాలన్నారు. నేత్ర వైద్యుడు ఐ.శ్రీనివాస్ మాట్లాడుతూ నేత్రదానం చేసేవారు ముందుగా తమపేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విల్సన్, హెచ్‌వీ పద్మజ పాల్గొన్నారు.

**నేత్రదానంపై విస్తృత ప్రచారం**

**దెందులూరు:** నేత్రదానంపై విస్తృత ప్రచారం ప్రతీ ఒక్కరి బాధ్యత అని స్వచ్ఛంద సంస్థలు, యువత తమ వంతు సహాయ సహకారాలు అందించాలని హేలాపురి విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జరజాపు రంగారావు, డైరెక్టర్ చుక్కా అవినాష్ రాజు, నాయకులు బీవీ రమణమూర్తి అన్నారు. మంగళవారం పోతునూరులో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఏలూరు విజన్ లయన్స్ క్లబ్, శివారు గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్యం, వృత్తి విద్యా, సేవా రంగాలకు తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

## డిగ్రీ కళాశాలపై న్యాక్ టీం సంతృప్తి



న్యాక్ టీం తుది సిఫారసు పత్రాలను ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న దృశ్యం

**ఉంగుటూరు:** నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రెండో రోజు న్యాక్ పీర్ టీం సభ్యులు పరిశీలించారు. కళాశాల పరిశీలన సందర్భంలో సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలలో మానవీయ విలువలు, పచ్చదనం, పరిశుభ్రత, సమాజాభివృద్ధికి తోడ్పడే వివరాలను అడిగి తెలుసుకన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్, రెడ్‌రిబ్బన్ క్లబ్, ఎకోక్లబ్ మొదలగు విభాగాల పని తీరును పరిశీలించారు. న్యాక్ టీం చైర్మన్ ప్రొఫెసర్ అమితాబ్ సక్సేనా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న కళాశాలలో మౌలిక వసతులు బాగానే ఉన్నాయని అడ్మిషన్లు పెంచుకోవల్సిన అవసరం ఉందని తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ నేక్ కమిటి పరిశీలన పూర్తయిందని, మంచి గ్రేడు వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈపూరి సత్యనారాయణ, సాగిరాజు జానికి రామరాజు, బొమ్మిడి అప్పారావు, ఆదిరెడ్డి సత్యనారాయణ, సీతారామాంజనేయరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు 10 వేల ప్యాకెట్లు



విజయవాడ వరద బాధితులకు 10 వేల టమాటా బాత్ ప్యాకెట్లు తయారు చేసి పంపుతున్న దృశ్యం

**దెందులూరు:** కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు విజయవాడలోని వరద బాధితులకు 10 వేల టమాటా బాత్ ప్యాకెట్లు సిద్ధం చేసి పంపించామని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. దెందులూరు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు 10 వేల టమాటా బాత్ ప్యాకెట్ల ఏర్పాటులో రేయింబవళ్లు శ్రమించారన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఏలూరు ఆర్డీవో ఖాజావలీ స్వయంగా పర్యవేక్షించారన్నారు. విజయవాడ వరద బాధితులకు సాయం అందించే విషయంలో రెవెన్యూ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించారని తహసీల్దార్ సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఆకర్షణీయంగా లంబోదరుడి విగ్రహాలు

- తయారీలో నిమగ్నమైన రాజస్థాన్ కళాకారులు
- 9 అడుగుల వరకు భారీ విగ్రహాలు సిద్ధం



భీమడోలు జంక్షన్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథుడి భారీ విగ్రహాలు

**భీమడోలు:** భీమడోలు జంక్షన్‌లో రాజస్థానీ కళాకారులు లంబోదరుడి భారీ విగ్రహాలను తయారు చేస్తూ ఎందరో కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. విగ్రహాలను వివిధ రూపాల్లో ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. దీంతో వివిధ ఆకృతుల్లో అడుగు నుంచి 9 అడుగుల పైగా ఎత్తు గల విగ్రహాలను రూపొందిస్తున్నారు. రూ.600 నుంచి 30 వేల వరకు విగ్రహాలు అమ్మకానికి సిద్ధం చేశారు. పల్లె, పట్టణాలు అనే తేడా లేకుండా విఘ్నాలు తొలగించే తెలుగు వారి తొలి పండుగ వినాయక చవితిని వాడవాడలా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు సిద్ధమయ్యారు. కంప్యూటర్ గ్రాఫిక్స్ విగ్రహాన్ని రూపొందించి వాటిని తయారు చేయాలని కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో భీమడోలులోని రాజస్థాన్ కుటుంబం కొన్ని నెలలుగా ప్రత్యేకంగా ఉండే అచ్చులను హైదరాబాద్ నుంచి తెప్పించి, భారీ విగ్రహాలను తయారు చేస్తున్నారు. నిష్ణాతులైన కళాకారులచే విగ్రహాల తయారీ చేయిస్తున్నారు. అయితే విగ్రహాన్ని తయారు చేసేందుకు వాడే ముడి సరుకు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో విగ్రహాల ధరలు కూడా పెంచాల్సి వస్తుందని తయారీదారులు తెలిపారు. గత 11 ఏళ్లుగా విగ్రహాలను తయారు చేసుకొని జీవిస్తూ పలువురికి ఉపాధి కల్పిస్తున్నామని, అయితే గతం కన్నా ధరలు పెరిగిపోవడంతో ఉత్సవ కమిటీ నిర్వాహకులు వెనుకంజ వేస్తున్నారని, తామంతా ఏడాది పొడవుగా కష్టించి విగ్రహాలను తయారు చేస్తున్నామని, పెద్ద విగ్రహం అమ్మితే కేవలం రూ.1500 వస్తుందని రాజస్థానీ మహిళ సుందరి తెలిపింది.



బుల్లి విగ్రహాలకు రంగులు అద్దుతున్న దృశ్యం

### నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ప్రతాప శివ కిషోర్

**ఏలూరు టౌన్:** ఏలూరు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ అన్నారు. నగరంలో ఇండోర్ స్టేడియం, కలెక్టరేట్, జడ్పీ సెంటర్, ఫైర్‌స్టేషన్, ఓవర్ బ్రిడ్జి సెంటర్, రైల్వే లైన్ ప్రాంతాలలో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాలేజీలు విడిచి పెట్టే సమయంలో విద్యార్థులు వెళ్లేందుకు కాలేజీ బస్సులు నిలిపి ఉంచే ప్రదేశాలను పరిశీలన చేసి ట్రాఫిక్ నియంత్రించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇండోర్ స్టేడియం ప్రాంతంలో విద్యార్థినులతో ఎస్పీ మాట్లాడుతూ కాలేజీ విడిచిపెట్టిన సమయాల్లో, బస్సులు ఎక్కే సమయాలలో ఏదైనా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని విద్యార్థినులకు ఎస్పీ వివరించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

## అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



భీమడోలు: టీచర్ దంపతులను సత్కరించిన దృశ్యం



దెందులూరు: పీఈటీ గారపాటి విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న పీడీలు, పీఈటీలు

**భీమడోలు:** అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. దుద్దేపూడి పంచాయతీ శివారు అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలోని ఎంటీఎస్ టీచర్ పదవీ విరమణ నేపథ్యంలో కేటీఎస్ రవికుమార్‌కు మంగళవారం పాఠశాల ఆత్మీయ వీడ్కోలు సభను నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పీఈటీ శిక్షణ ఆదర్శనీయం**

**దెందులూరు:** వ్యాయామ ఉపాధ్యాయుడిగా గారపాటి విజయకుమార్ ఆదర్శనీయమైన శిక్షణ, సేవలు అందించారని గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం డాక్టర్ ఎం.మనోహర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం మండల కో ఆర్డినేటర్ జక్కుల సురేష్, నియోజకవర్గ కోఆర్డినేటర్ రాజగోపాల్ అన్నారు. పీఈటీగా ఉద్యోగ విరమణ చేసిన గారపాటి విజయ్‌కుమార్‌ను దెందులూరు నియోజకవర్గంలో ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

## వంగాయగూడెంలో చోరీ

**ఏలూరు టౌన్:** ఏలూరు వన్‌టౌన్‌లోని వంగాయగూడెం ప్రాంతంలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి మూడున్నర కాసుల బంగారు ఆభరణాలను అపహరించారు. వన్‌టౌన్ సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంగాయగూడెం ప్రాంతానికి చెందిన కె.విజయ శృంగారం అనే మహిళ తన ఇంటికి తాళం వేసి గత నెల 28న దుగ్గిరాలలోని తన సోదరుడి ఇంటికి వెళ్లి తిరిగి 2వ తేదీన ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులకొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలకొట్టి సేఫ్ లాకర్‌లో ఉండాల్సిన మూడున్నర కాసుల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై మదీనా బాష చెప్పారు.

# కోమటిలంక చుట్టూ వరద నీరు

**కొల్లేరు గ్రామాల్లో ఆందోళన**



రోడ్డు మునిగిపోవడంతో కోమటిలంక గట్టుపై నిలిచిపోయిన వాహనాలు

**ఏలూరు రూరల్:** ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామాలను మంగళవారం వరదనీరు చుట్టుముట్టింది. శ్రీపర్రు, కలకుర్రు, మానూరు, కోమటిలంక, పెదయాగనమిల్లి, పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయిలంక, గుడివాకలంక, మొండికోడు గ్రామాల ప్రజలను వరద భయం వెంటాడుతోంది. నాలుగురోజులుగా తమ్మిలేరు బుడమేరు గుండా కొల్లేరులోనికి వేల క్యూసెక్కుల వరదనీరు చేరుతున్న సంగతి తెలిసిందే. దీంతో కొల్లేరులో ప్రధాన డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరదనీరు వేగంగా సముద్రంలోకి చేరడం లేదని, దీనివల్ల నీరు వెనక్కి ఎగదన్ని గ్రామాలను ముంచేసే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు**

ఇప్పటికే కొల్లేరులో నడిమధ్యలో ఉన్న కోమటిలంక గ్రామాన్ని వరదనీరు చుట్టు ముట్టింది. ప్రధానరోడ్డుపై నుంచి 10 అడుగుల ఎత్తులో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. బడి పిల్లలు, మహిళలు, వృద్ధులు రేకు పడవపై ప్రయాణం నిలిపేశారు. నిత్యావసర సరుకుల కోసం పురుషులు రేకు పడవపై భయం భయంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. మరోపక్క గుడివాకలంక పరిసరాల్లో పలు చోట్ల ప్రధాన రోడ్డుపై నుంచి వరద ప్రవహిస్తోంది. స్థానిక బీసీ కాలనీ పక్క నుంచి వరద వేగంగా పారుతోంది. మరో రెండు అడుగులు నీటి మట్టం పెరిగితే, కాలనీలోకి వరదనీరు చేరే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మొండికోడు గట్టు దిగువన నిర్మించుకున్న గుడిసెల వద్ద నుంచి వరద పారుతోంది. ప్రత్తికోళ్లలంక బీసీకాలనీ, జెడ్పీ స్కూల్ ఆటస్థలంలో వరదనీరు చేరింది. పైడిచింతపాడు నుంచి కొల్లేటికోటకు వెళ్లే రోడ్డు నీట మునిగింది. ఫలితంగా ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. కలకుర్రు గ్రామానికి వరద చుట్టుముట్టింది. ప్రధానరోడ్డుపైకి నీరు చేరుతోంది. శ్రీపర్రు బీసీకాలనీ, లింగారావుగూడెం లోతట్టు ప్రాంతాలకు పంటచేల గుండా వరదనీరు ప్రవేశించింది.



కోమటిలంక వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీటిలో పయనిస్తున్న దృశ్యం



తాళ్లసాయంతో రేకు పడవలో పయనిస్తున్న కోమటిలంక వాసులు

#### అధికారులు రాలేదు



మా గ్రామాన్ని వరద చుట్టేసింది. పడవ మార్గం ప్రమాదకరంగా మారింది. పిల్లలు, మహిళలు, వృద్ధులు రెండురోజులుగా ఇంటిలోనే ఉంటున్నారు. పాలు, మంచినీళ్లు పూర్తిస్థాయిలో అందడంలేదు. మండల స్థాయి అధికారులు ఎవ్వరూ మా గ్రామానికి రాలేదు. అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం మోటార్ పడవ అందుబాటులో ఉంచాలి. మా ఊరిలో రోగుల కోసం డాక్టర్‌ను, వైద్య శిబిరంను ఏర్పాటు చేయాలి.

– తెనాలి యోహాన్, కోమటిలంక సర్పంచ్